

# సంసారంలో సరిగమలు

## - తమస్విని



*(ప్రతి సంసారంలోనూ వినిపించే రాగాలు..*

*కొన్ని సరదాలు, కొన్ని సరాగాలు,*

*కొన్ని సరసాలు, ఇంకొన్ని విరసాలు, మరికొన్ని విషాద గీతాలు..*

*వెరసి సంసారంలో సరిగమలు..!)*

### నేనొక దుర్గం

**బెరుగ్గా** కాలింగ్‌బెల్ కొట్టాడు రవీంద్ర. అసలు ఇంటినించి బయలుదేరినప్పటినించి భయంగానే ఉంది. కొడుకుని అప్పటికి వందోసారి తిట్టుకున్నాడు ‘వాడు చేప్తే చెప్పాడు, నీ బుద్ధి ఏమైంది?‘ అని ఆవిడ దుమ్మెత్తి పోయదు కదా అనే భయంతో ఆయన బెరుగ్గా ఆ అపార్ట్‌మెంట్ కాలింగ్ బెల్ నొక్కాడు.

రెండు నిమిషాల్లో తలుపు తెరుచుకుంది.

"లోపలికి రండి" ఆ ఇంటావిడ సాదరంగా ఆహ్వానించింది.

అప్పటికి సాంత్వనపడ్డ ఆయన లోపలికి వెళ్ళి అక్కడున్న ఓ సోఫాలో కూలబడ్డాడు.

"మంచినీళ్ళు తెస్తాను" ఆవిడ లోపలకి వెళ్ళింది.

వెనకనించి ఆమెని తదేకంగా చూసాడు రవీంద్ర. తన భార్య కంటే లావు. కుదురుగా ఉంది ఆకారం. పెద్ద జడ ‘అందగత్తె‘ అనుకున్నాడు.

ఆవిడ మంచినీళ్ళ గ్లాస్‌ని టీపాయ్ మీద పెట్టి ఆయన ఎదురు సోఫాలో కూర్చుంది. ఇద్దరికీ సంభాషణ ఎలా మొదలుపెట్టాలో అర్ధంకాలేదు.

"నా పేరు దుర్గ. మేఘ మా అమ్మాయి" ఆవిడ చెప్పింది.

"తెలుసు. ఆకాష్ మా అబ్బాయి" రవీంద్ర చెప్పాడు.

మళ్ళీ రెండు నిమిషాలు మౌనం.

"వంట చేసాను. భోంచేద్దాం రండి." లేచి చెప్పింది.

దుర్గ వెనకే డైనింగ్ రూంలోకి నడిచాడు. రెండు బెడ్ రూముల అపార్ట్‌మెంట్. విశాలంగా శుభ్రంగా ఉంది. తనిల్లు ఇంతకంటే పెద్దదైనా ఇంత పొందిగ్గా ఉండదు అనుకున్నాడు.

"సాధారణంగా అంతా చికెన్ తింటారని గోంగూర చికెన్ చేసాను. మా అల్లుడికి ఇది చాలా ఇష్టం" వడ్డిస్తూ చెప్పింది దుర్గ.

"నేను నాన్‌వెజ్ దాదాపుగా మానేసాను" రవీంద్ర మొహమాటంగా చెప్పాడు.

"అవునా? నాకు వారంలో నాలుగురోజులు నాన్‌వెజ్ ఉండాల్సిందే కాయగూరలు గడ్డిలాగా అనిపిస్తాయి" చెప్పింది.

'అందుకే అంతలావున్నావు' మనసులో అనుకున్నాడు.

"పాలకూర పప్పు చేసాను. అది తినండి పోనీ."

రెండు ముద్దలు తిని చెప్పాడు.

"మా ఇంట్లో పప్పులో చింతపండు వేయం. పులుపు అసలు తినలేం."

"అయ్యో! పోనీ సాంబార్ తినండి"

"మీరు సాంబారులో బెల్లం వేస్తారా?" మొహం వికారంగా పెట్టి అడిగాడు.

"అవును. కొద్దిగా వేస్తాను. మంచి రుచి వస్తుంది" చెప్పింది.

భోజనాలయాక ఇద్దరూ మళ్ళీ ముందు గదిలోకి వచ్చారు. రవీంద్ర కొంచెం ఇబ్బందిగా చెప్పాడు.

"భోజనం అవగానే టీ తాగడం నాకు అలవాటు. అసలు గంటకోసారి తాగుతాను. లేకపోతే బుర్రపనిచేయదు."

"ఒక్క నిమిషం" దుర్గ లేచింది.

"చక్కెర వేయకండి. షుగర్ బార్డర్‌లో ఉందని డాక్టర్ చెప్పారు"

"సరే"

ఐదు నిమిషాల తర్వాత దుర్గ టీ కప్పుతో వచ్చింది. ఆయన దాన్ని ఆనందంగా అందుకున్నాడు.

"మా వారు పదేళ్ళ క్రితం ఏక్సిడెంట్లో పోయారు. ఆఫీస్ నించి వస్తూంటే ఆర్టీసీ బస్ గుద్దేసింది. ఆర్నెల్ల తర్వాత ఆయన ఉద్యోగం నాకు ఇచ్చారు. అప్పుడు మేఘ అమెరికాలో ఉంది. యం.ఎస్‌కి వెళ్ళింది. 'నా దగ్గరకి రండి నాన్న' అని పిలిచేది ఎప్పుడూ. రిటైరయ్యాక వచ్చి ఆర్నెల్లు ఉంటానమ్మా; అనే వాళ్ళుకాని... తర్వాత మేఘ అక్కడే ఉద్యోగంలో చేరింది. వాళ్ళ ఆఫీస్‌లో పనిచేసే ఓ జర్మన్ అబ్బాయిని ప్రేమించి పెళ్ళి చేసుకుంది, నేనూ వెళ్ళొచ్చాను. పెళ్ళి తర్వాత తను నాలుగైదుసార్లు వచ్చింది కానీ అతను రాలేదు. యూరోపియన్స్‌కి కొంచెం గర్వం అనుకుంటా. 'ఇండియా వస్తే, మా దేశంలోంచి ఎప్పుడో మాయమైన అంటు వ్యాధులన్నీ అంటుకుంటాయ్. నేను చచ్చిపోతాను. కావాలంటే నువ్వు వెళ్ళు' అంటాడట. రెండు డెలివరీలకి వెళ్ళి ఆరేసి నెలలు ఉండి వచ్చాను. కానీ అక్కడ పర్మినెంట్‌గా ఉండలేనని అర్థమైంది. అల్లుడి ముందు అన్నీ స్పూన్‌తో తినాలి. పిల్లల్ని ఎత్తుకోకూడదు. అన్నం నోట్లో పెట్టకూడదు. పక్కన పడుకో పెట్టుకోకూడదు. నాకైతే జైల్లో ఉన్నట్లు ఉండేది. సెలవు లేదని వెళ్ళడం మానేసా"

దుర్గ రెండు నిమిషాలు మౌనంగా ఉండి చెప్పింది.

"రెండేళ్ళ క్రితం రిటైరయ్యాను. ఇప్పుడు మా అమ్మాయికి గిల్టీ ఎక్కువైంది. 'నాన్న లేరు. నువ్వొక్కదానివే ఉంటావా? నా దగ్గరకిరా' అంటుంది. నిజానికి నేను హాయిగా ఉన్నాను. ఆ మాట చెపితే అది నమ్మదు మీ ఆకాష్ తనతోపాటే పనిచేస్తాడట. ఇద్దరూ మంచి ఫ్రెండ్స్. అతనూ మీ గురించి బాధపడతాడట. సో ఇద్దరూ కలిసి ఈ పరిష్కారం ఆలోచించారు." కొద్దిగా అయిష్టంగా చెప్పింది.

"మాకు ఆకాష్ ఒక్కడే వాడు మీ అమ్మాయిలాగే చదువు, ఉద్యోగం. కాకపోతే అమెరికా అమ్మాయిని చేసుకున్నాడు. ఇక్కడ శాస్త్రోక్తంగా పెళ్ళిచేసాం. అక్కడికి వెళ్ళి రిజిస్టర్ చేసుకున్నారు. ఆ అమ్మాయి ఒక్కసారే ఇండియా వచ్చింది. తర్వాత ఎండ, దుమ్ము, పొల్యూషన్ నేనురాను పొమ్మంది. మా ఆవిడ పోయినప్పుడు కూడా వాడొక్కడే వచ్చి కర్మకాండ చేసాడు" రవీంద్ర ఆగాడు.

దుర్గ సానుభూతిగా చూసింది.

"అప్పటినించీ మీ అమ్మాయిలాగే వాడికీ గిల్టీ. నేనూ రెండుసార్లు వెళ్ళొచ్చాను. కానీ ఆ పిల్లతో పడలేదు. మావాడితో అన్ని పనులు చేయించడం, నన్ను పేరుతో పిలవడం, కోపం వస్తే వాడిని బూతులు తిట్టడం నేను భరించలేకపోయాను. కావాలంటే నువ్వు వచ్చి నన్ను చూసి వెళ్తూండు. నేను మాత్రం రానని గట్టిగా చెప్పి వచ్చేసాను. మీ అమ్మాయిని వాడు అక్క అంటాడట. ఇద్దరూ లంచ్ టైంలో మా అమ్మ, మా నాన్న అని మనగురించి మాట్లాడుకుంటున్నప్పుడు 'మీ అమ్మకి, మా నాన్నకి పెళ్ళి చేస్తే?' అనే ఆలోచన వచ్చిందిట వాడికి. అప్పటినించి నన్ను పొద్దున, రాత్రి ఫోన్ చేసి చంపుతున్నాడు.

'నువ్వొక్కడివే ఎలా ఉంటావు నాన్నా నువ్వు పెళ్ళిచేసుకుంటే నాకు నిశ్చింత. మేఘక్క వాళ్ళమమ్మీ చాలా మంచిదట' అని గోల. చివరికి ఈరోజు మిమ్మల్ని కలవకపోతే నాతో మాట్లాడనని బెదిరించాడు. ఇక తప్పలేదు" చెప్పి రవీంద్ర 'అమ్మయ్య' అనుకున్నాడు.

"ఇంట్లో ఆడవాళ్ళు లేకపోతే కష్టమే. భోజనం ఎలా?" దుర్గ ఇంకో కప్పు టీ ఇస్తూ అడిగింది.

ఆవిడ జాకెట్ చేతులు మరీ పొట్టిగా ఉన్నాయి వీపు కూడా కిందకి ఉందని గమనించాడు.

"వంటమనిషి ఉంది. నార్తిండియన్ పొద్దున చపాతీలు, కూర చేసి పెట్టి వెళ్తుంది. సాయంత్రం మళ్ళీ వచ్చి చేస్తుంది. నేను పొద్దునవి రాత్రికి తినను. అన్నం మీద భ్రాంతి పుడితే నేనే రైస్ కుక్కర్‌లో అన్నం వండుకుని పచ్చళ్ళతో తింటూంటా. ఆవిడ వెజిటేరియన్. దాంతో అన్నీ వెజ్ వంటకాలే. మా ఆవిడ పోయే ముందు దాదాపు నాలుగైదేళ్ళు బాగా జబ్బు పడింది. ఈ వంటావిడ అప్పటినించి ఉంది. అందుకే నాకు నాన్‌వెజ్ అలవాటు పూర్తిగా పోయింది."

"అయ్యో! నేను పొద్దుటి పూట ఒక్కసారే చేసేస్తాను. సాయంత్రం ఒక్క అన్నమే వండుకుంటా. సాయంత్రాలు పని చేయాలంటే ఒళ్ళొంగదు. చపాతీలు తినను. నాకెందుకో నచ్చవు. త్రీ సిక్స్‌టీ ఫైవ్ డేస్ అన్నమే. ఇడ్లీ పిండి, దోస పిండి రుబ్బి ఫ్రిజ్‌లో పెడతాను. అన్నం, కూరలు వండడానికి బద్ధకంగా ఉంటే ఇడ్లీ వేసుకుని ఆవకాయతో తినేస్తా" దుర్గ చెప్పింది.

"మరి మిగతా టైం?" అడిగాడు.

"టి.వి చూస్తా. నాకు సినిమాలంటే పిచ్చి. యూ ట్యూబ్, నెట్‌ఫ్లిక్స్ సినిమాలు అన్ని భాషలవీ చూస్తాను. కొత్త సినిమా రిలీజైతే థియేటర్‌కి వెళ్ళి చూసి, హోటల్లో డిన్నర్ చేసి వస్తాను. నాకు ఫ్రెండ్స్ కూడా ఎక్కువే. అందరం సరదాగా టూర్‌కి ఢిల్లీ, బాంబేలాంటి చోట్లకి వెళ్తూంటాం" ఉత్సాహంగా చెప్పింది.

"నాకు టి.వి అంటే చిరాకు. ఆ సీరియల్స్, సినిమాలు చాలా ఇరిటేటింగ్‌గా ఉంటాయి. నేను చాగంటివారివి, గరికపాటిగారివి ప్రసంగాలు వింటూంటా. సాయంత్రాలు వాకింగ్‌లా ఉంటుందని, మా ఇంటికి ఫర్లాంగు దూరంలో ఉన్న గుడికి వెళ్ళి కాసేపు కూర్చుని వస్తూంటాను. నేను కేవలం వార్తల కోసమే టి.వి పెడతా" రవీంద్ర చెప్పాడు.

"నాకు ఆధ్యాత్మికాలంటే చిరాకు. దేవుడికి, నాకు చుక్కెదురు నేను సైన్స్‌ని నమ్ముతాను. అంటే, నిరూపించబడనివాటిని నమ్మను, పూజలు, వ్రతాలు, ఉపవాసాలు, ఉపన్యాసాలు.. ఏవీ నమ్మను. వినను ఆచరించను. పెద్దయ్యాక ఆధ్యాత్మికత అదే వస్తుందిలే అంటారు నా ఫ్రెండ్స్. నాకు ఇప్పుడు అరవైరెండేళ్ళు. ఇంతదాక రానిది ఇంక రాదు. నాకు ఏమాత్రం ఆసక్తి లేని సబ్జెక్ట్ అది. ముసలివాళ్ళు అవగానే రావడానికి అది కీళ్ళవాతమో, పక్షవాతమో కాదుకదా" దుర్గ చిరాగ్గా చెప్పింది.

"నాకు అరవై ఐదేళ్ళు ఈ మధ్య గుడికి వెళ్ళొస్తూంటే మోకాళ్ళ కొద్దిగా నొప్పి పుడుతున్నాయి. డాక్టర్ దగ్గరకివెళితే కీళ్ళు అరిగిపోయాయి. ఎక్కువసేపు నడవద్దు. మెట్లు అసలు ఎక్కద్దు అని చెప్పాడు. అప్పటి నించి కొద్దిగా జాగ్రత్తలోనే ఉన్నా. మా ఆవిడకి ఒంట్లో బావుండనప్పుడు మృత్యుంజయ హోమం చేసాం. చిన్నప్పటినించీ నాకు భక్తి ఎక్కువ. మా ఆవిడ కూడా వరలక్ష్మీ వ్రతాలులాంటివి చేసేది" రవీంద్ర చెప్పాడు.

''నాకు ఏ రోగాలు, రొష్టులు లేవు. డయాబెటీస్, బి.పిలాంటి వంశపారంపర్య జబ్బులు కూడా లేవు. మా వారు నా ఏభయ్యో ఏట పోయారు. తర్వాత ఉద్యోగంలో చేరాను. స్వతంత్రంగా ఉండటం అలవాటైపోయింది. ఈ ఫ్లాట్స్ ఉన్న స్థలం మాదే. డెవలప్‌మెంట్‌కి ఇచ్చి రెండు ఫ్లాట్స్ ఉంచుకున్నాను. దానిమీద అద్దె, నా పెన్షన్ సరిపోయాయి. మిగిలిన డబ్బు బేంక్‌లో వేసాను. ఆర్థికంగా నాకేం లోటు లేదు'' దుర్గ చెప్పింది.

''నేను మంచి ఉద్యోగమే చేసాను. పెన్షన్ నలభైవేల పైనే వస్తుంది. రెండిళ్ళున్నాయి. మా కొలీగ్స్‌లా ఎందుకో నాకు ఆఫీసర్స్ క్లబ్‌కి వెళ్ళడం, అక్కడ పేకాట ఆడటం ఇష్టం ఉండేదికాదు. ఇంట్లో భార్యాపిల్లలతో గడపడమే ఇష్టంగా ఉండేది. ఆకాష్ అమెరికా వెళ్ళాక భారతి జబ్బుపడింది. తర్వాత వంటరివాడినైపోయాను'' నిట్టూర్చాడు.

''ఎప్పుడైనా ఫ్రెండ్స్ ఇళ్ళకి వెళ్ళడం, వాళ్ళు రావడంలాంటివి మనలాంటి వంటరివాళ్ళకి టానిక్‌లా ఉత్సాహాన్నిస్తాయి'' దుర్గ చెప్పింది.

''లేదు. నాకెవరూ ఫ్రెండ్స్ లేరు. నేను ఎక్కువ మాట్లాడను. వినడం కూడా చిరాకే. నా అభిప్రాయాలు కలవని మనుషులతో అసలు కలవలేను. భారతితో కూడా అభిప్రాయభేదాలు వస్తే, వారం పదిరోజులపాటు మాట్లాడేవాడిని కాదు. ఇంక బయలుదేరతాను. చాలా టైమైంది'' రవీంద్ర లేచి నుంచున్నాడు.

దుర్గ కూడా లేచి నిలబడింది. ఆయన వెళ్ళాక తలుపు మూసి లోపల గడియపెట్టింది. సెల్‌ఫోన్ తీసుకుని కూతురి నంబర్‌కి ఫోన్ చేసింది.

''హలో అమ్మా. ఏంటీ ఇప్పుడు కాల్ చేసావ్? డాడీ నచ్చారా?'' మేఘ గొంతు వినబడింది.

''నోర్మూయ్ డేడీ ట డేడీ! నీ కసలు బుద్ధుందా? హాయిగా బతుకుతున్నాను. నాకు పెళ్ళేంటే? ఇంకోసారి ఈ ప్రసక్తి ఎత్తితే నేనే నీతో మాట్లాడను'' దుర్గ అరిచింది.

''ఏమైందమ్మా? ఆయన నచ్చలేదా?'' మేఘ కంగారుగా అడిగింది.

''నచ్చడమా? అరవై ఏళ్ళ వయసులో నాకు అందగాడు కావాలా? ఆయన సినిమాలు చూడడు. షికార్లు తిరగడు, మాంసం తినడు, టి.వి చూడడు. ప్రవచనాలు వింటాడు. పొద్దున వండినవి రాత్రికి తినడు. పులుపు, తీపి నిషేధం. గంట గంటకి టీ కావాలి. అభిప్రాయ భేదాలు వస్తే పెళ్ళాంతో వారం పదిరోజులు మాట్లాడడు. రిక్రియేషన్ వాళ్ళ వీధి చివరున్న గుడి.. అవసరమా? ఈ జంఝాటాలన్నీ నాకు అవసరమా?'' గద్దించింది.

''అదికాదమ్మా. సిక్స్‌టీ ప్లస్ కదా సాయంకావాలని'' గొణిగింది.

''నాకు సాయంకాదు. ఆయనకే సాయంకాలమైపోయింది. డయాబెటిస్ బార్డర్‌లో ఉందిట. కీళ్ళనొప్పులట ఇంకా ఏమేం రోగాలున్నాయో! చూడు మేఘా. నేను శుభ్రంగా తిని తిరుగుతూ నాకు కావాల్సినట్లుగా ఉంటున్నా. నాకీ సాయాలు వద్దు. నీకీ ప్రయాసలు వద్దు. నన్నొదిలేయ్'' దుర్గ ఫోన్ పెట్టేసి ఆవేశాన్ని అణచుకుంటూ టి.వి ఆన్ చేసింది.

ఉబర్ టేక్సీలోంచే కొడుక్కి ఫోన్ చేసిన రవీంద్ర అతను ఫోన్ ఎత్తగానే తిట్లు లంకించుకున్నాడు.

''నాన్నా. బ్రేక్ అవుతుంది. ఇంటికి వెళ్ళాక చెయ్'' ఆకాష్ ఫోన్ పెట్టేసాడు.

ఇంటికి వెళ్ళిన రవీంద్ర తలుపు తీసి లోపలికి వెళ్ళగానే కొడుక్కి ఫోన్ చేసాడు.

''ఏం నాన్నా ఆవిడ బాలేదా?'' కొంటెగా అడిగాడు ఆకాష్.

''బావుందిరా. ఎందుకు బాలేదు? రంభలా ఉంది'' అక్కసుగా అరిచాడు.

"ఏమైంది నాన్నా?"

"నువ్వు పెళ్ళి అన్నావని, ముసలాడికి దసరాపండగలా వెళ్ళాను చూడు. ఛీ! ఆవిడ శూర్పణఖలా ఉంది. మీ అమ్మ కంటే ఎంతలావో. కర్చీఫ్‌తో జాకెట్ కుట్టించుకున్నట్లుంది. ఒక్కతే సినిమాలకి, హోటళ్ళకి వెళ్తుందిట.."

"మరి వంటరిగా ఉన్న మనిషికి ఎప్పుడూ ఎవరు తోడుంటారు నాన్నా?"

"నేను ఒంటిగాడ్నే. అట్లా బలాదూర్ తిరుగుతున్నానా? కృష్ణా! రామా అనుకుంటూ ప్రవచనాలు వింటూ గుడికి వెళ్తున్నాను. ఆవిడో? భక్తురాలు కాదట. సైన్స్ చెప్పిందే ఏదీ నమ్మదట. పెద్ద మేరీక్యూరీ! నాకసలు నచ్చలేదురా అబ్బాయ్. ముక్కలేకపోతే ముద్దదిగదుట. సాంబార్‌లో బెల్లం, ఆకుకూర పప్పులో చింతపండు....ఛ..ఛ బద్ధకంట. పొద్దునవి రాత్రికి తింటుందిట. చపాతీలు ఇష్టం లేదుట. పొగరురా అబ్బాయ్. 'నాకు ఏ రోగం లేద'ని ఎంత పొగరుగా చెప్పిందనుకున్నావు? నాకస్సలు నచ్చలేదు. అసలు నాకీ పెళ్ళి ప్రస్థావనలు తేవద్దు చెప్తున్నా. హాయిగా బతుకుతున్నవాడికి అలివిమాలిన పెళ్ళాన్ని కట్టబెట్టద్దు. ఇంతకాలం సంపాదించుకున్న పరువు పోతుంది. ఫ్రెండ్స్‌తో ఢిల్లీలు, బొంబాయ్‌లు వెళ్తాందిట. పదేళ్ళనాడు మొగుడిపోయిన మనిషి ఎలా ఉండాలి?" ఆయన అరుస్తూనే ఉన్నాడు.

"పోన్లే నాన్నా వదిలెయ్" ఆకాష్ అయిష్టంగా చెప్పాడు.

రవీంద్ర చిరుబురులాడుతూ ఫోన్ పెట్టేసాడు.

"సారీ అక్కా! వాళ్ళిద్దరూ వంటరిగా ఉన్నారు, ఒకరికి మరొకరు సాయంగా ఉంటారని మనం అనుకున్నాం కానీ, వాళ్ళ ఆలోచనలు, భావాలు చాలా స్ట్రాంగ్‌గా ఉన్నాయి. చిన్నవయసులో పెళ్ళయినవాళ్ళు లేత వయసుకాబట్టి భావాలు కూడా మారడం లేదా అడ్జస్ట్ అవడం జరుగుతుంది కానీ వీళ్ళతోపాటు వీళ్ళ భావాలు ముదిరిపోయాయి. ఎవరికి వాళ్ళు ఒక దుర్గం. అందులోకి ఇంకొకరు ప్రవేశించలేరు. ప్రవేశించనీరు... **ఆకాష్**"

ఆకాష్ ఆ రాత్రి మేఘకి ఈ మెయిల్ ఇచ్చి పడుకున్నాడు. అదే అర్థంతో మేఘనుంచి కూడా అప్పుడే మెయిల్ వచ్చింది.

***(వచ్చే సంచికలో మరో సరిగమ)***

Click here to share your comments